# పక్కా ప్రణాళికతో కుటుంబ సర్వే : కలెక్టర్



ఖిలావరంగల్ : కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంల్, నవంబర్ 9: జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సత్య శారద అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ ఉమార్ సుల్తానియాతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, వరంగల్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2.63 లక్షల కుటుంబాలు ఉన్నాయని సత్య శారద తెలిపారు. ఇందులో జీడబ్ల్యూఎంసీ, వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీ అర్బన్ పరిధిలో 1,17,256 కుటుంబాలు, రూరల్ పరిధిలోని 11 మండలాల్లో 1,45,882 కుటుంబాలు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, సీపీవో గోవిందరాజన్ పాల్గొన్నారు. అలాగే, జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులు వినియోగించుకోవాలని కలెక్టర్ సత్య శారద సూచించారు.

### తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వే చేయాలి : సత్య శారద

సంగెం/వర్ధన్నపేట/గీసుగొండ/ఖానాపురం/నెక్కొండ/పర్వతగిరి/కాశీబుగ్గ/చెన్నారావుపేట/దుగ్గొండి/రాయపర్తి: ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులకు తావులేకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. శనివారం ఆమె సంగెం మండలం తీగరాజుపల్లి, గవిచర్లలో పర్యటించి ఎన్యూమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సూపర్‌వైజర్లు, ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సర్వే నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో ముందుగానే దండోరా వేయించాలని సూచించారు. సర్వేను తహసీల్దార్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎన్యూమరేటర్లకు గ్రామ పంచాయతీ సిబ్బంది పూర్తి సహకారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల సమయం ముగిసిన తర్వాత సర్వేలో పాల్గొనాలని సూచించారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం తదితర వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని ప్రజలను కోరారు. సర్వే వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. అలాగే, జిల్లా ప్రణాళికా ముఖ్య అధికారి గోవిందరాజన్, జడ్పీ సీఈవో రాంరెడ్డి వర్ధన్నపేట మండలం ఇల్లందలో సర్వేను పరిశీలించారు. అంతేకాకుండా మండలవ్యాప్తంగా సర్వేను తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో శ్రీమతి వెంకటరమణ గ్రామాల వారీగా పరిశీలించారు. గీసుగొండ మండలం మచ్చాపురం, అనంతారం, ఎలుకుర్తిలో సర్వేను డీపీవో కటకం కల్పన పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు. ఖానాపురంతోపాటు రాంగపేట, కొత్తూరులో సర్వే తీరును మండల ప్రత్యేకాధికారి సౌజన్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతి పరిశీలించారు. నెక్కొండలో సర్వేను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పర్వతగిరి మండలంలోని అన్నారంలో సర్వేను జడ్పీ సీఈవో రాంరెడ్డి, సీపీవో గోవిందరాజన్ పరిశీలించారు. రావూర్‌లో సర్వేను మండల ప్రత్యేకాధికారి నీరజ పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలు చేశారు. 19వ డివిజన్ కాశీబుగ్గలో సర్వేను ఉమ్మడి వరంగల్ జిల్లాల సర్వే ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి, కలెక్టర్ సత్య శారద పరిశీలించారు. కార్యక్రమంలో గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడె, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ఆర్ఐ సోహెల్ పాల్గొన్నారు. చెన్నారావుపేటలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి పరిశీలించారు. దుగ్గొండి మండలం లక్ష్మీపురంలో సర్వేను ఎంపీవో పరిశీలించారు. రాయపర్తి మండలంలో సర్వేను తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఎంపీవో కూచన ప్రకాశ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.























